

ముగిసిన ఈసెట్ కౌన్సెలింగ్

కరీంనగర్ టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన ఈసెట్ కౌన్సెలింగ్ గురువారం ముగిసింది. మూడో రోజు స్లాట్ బుక్ చేసుకున్న 203 మంది విద్యార్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసినట్లు ప్రిన్సిపాల్ డి శోభారాణి తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలన పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆప్షన్లు ఎంపిక చేసుకోవాలని సూచించారు.

మానేరు రివర్ ఫ్రంట్‌పై విచారణ జరిపించాలి

సీఎంకు వినతిపత్రం అందించిన చాడ


ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

భగత్‌నగర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మానేరు రివర్‌ఫ్రంట్ పనుల్లో జరిగిన అవినీతి, అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరిపించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి ముఖ్యమంత్రిని కోరారు. గురువారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కరీంనగర్‌లో మానేరు రివర్ ఫ్రంట్ అభివృద్ధి పనుల పేరుతో గత ప్రభుత్వం 500 కోట్లు మంజూరు చేసిందన్నారు. అందులో టూరిజం శాఖ 100 కోట్లు విడుదల చేసిందన్నారు. ఈ పనులను తమ అనుచరులకు అప్పగించిందన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకుండా కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహించారన్నారు. పనులు పూర్తి కాకుండానే బిల్లులు చెల్లించారన్నారు. రివర్‌ఫ్రంట్ పరిధిలో చెక్ డ్యాములు నిర్మిస్తే వర్షాకాలంలో అవి పూర్తిగా కొట్టుకుపోయాయన్నారు. చెక్‌డ్యాములు కొట్టుకుపోయిన తరువాత కూడా రివర్ ఫ్రంట్ నిర్మాణ పనులకు నిధులు విడుదల చేశారన్నారు. ఐదు సంవత్సరాలు గడుస్తున్నా పనులు పూర్తి కాలేదన్నారు. రివర్‌ఫ్రంట్ పనుల్లో జరిగిన అవినీతి, అక్రమాలపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని కోరారు.

సహాయ ఉపకరణాలకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు అందించనున్న సహాయ ఉపకరణాల దరఖాస్తుకు ఈ నెల 27 వరకు అవకాశం ఉందని జిల్లా సంక్షేమ అధికారి ఎం సరస్వతి ఒక ప్రకటనలో తెలిపారు. శారీరక దివ్యాంగులు, అంధులు, బధిరులు, మానసిక దివ్యాంగులకు ఉపకరణాలు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. దివ్యాంగులు tgobmmms.cgg.gov.in వెబ్‌సైట్‌లో ఈ నెల 27లోగా ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను జిల్లా ఎంపిక కమిటీ పరిశీలించి అర్హత గల ఉన్న వారిని ఎంపిక చేస్తుందని తెలిపారు. వివరాలకు జిల్లా సంక్షేమ శాఖ అధికారి కార్యాయలంలో సంప్రదించాలని సూచించారు.



ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం

- జాతీయ ప్రకృతి వ్యవసాయ పథకం అమలుకు శ్రీకారం
- జిల్లాలో 15 క్లస్టర్లలో 1,875 ఎకరాల్లో సాగు
- 10 బయో రీసోర్స్ సెంటర్ల ఏర్పాటు
- కొనసాగుతున్న రైతుల ఎంపిక

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

జాతీయ ప్రకృతి వ్యవసాయ పథకానికి జిల్లాలో శ్రీకారం చుట్టారు. ప్రయోగాత్మకంగా 1,875 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టేందుకు జిల్లా వ్యవసాయశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే ఆసక్తి ఉన్న రైతులను ఎంపిక చేస్తున్నది. కేంద్ర ప్రభుత్వం ఎరువులు, క్రిమిసంహారక మందుల వినియోగం లేకుండా సహజ సిద్ధంగా ప్రకృతి వ్యవసాయాన్ని చేసేలా రైతులను ప్రోత్సహించాలని నిర్ణయించింది. ఇందుకోసం జాతీయ ప్రకృతి వ్యవసాయ పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకంలో 60 శాతం నిధులను కేంద్రం భరిస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులను సమకూర్చాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం పథకం వచ్చి అన్ని జిల్లాల్లో ప్రయోగాత్మకంగా ప్రకృతి సాగును చేపట్టాలని వ్యవసాయ శాఖకు ఆదేశాలిచ్చింది.

ఎంపిక చేసిన రైతులకు శిక్షణ

ఎంపిక చేసిన రైతులకు చెందిన భూమి నుంచి మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు నిర్వహిస్తారు. ఆ నివేదికలకు అనుగుణంగా భూమిలో ఉన్న లోపాలను సరి చేసేందుకు చర్యలు తీసుకుంటారు. పంటల సాగుకు జీవామృతం, ఘన జీవామృతం, పచ్చిరొట్ట, వివిధ ఆకుల కషాయాలను, అగ్ని అస్త్రం, తదితర ప్రకృతి సిద్ధంగా తయారు చేసిన వాటిని వినియోగించాల్సి ఉంటుంది. వీటి తయారు కోసం రైతులకు అవసరమైన శిక్షణ ఇస్తారు. సాగు పద్ధతులను సేంద్రియ ఎరువులను వినియోగించే విషయంలో రైతులకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు, శిక్షణ ఇచ్చేందుకు క్లస్టర్‌కు కృషి సఖి లేదా కమ్యూనిటీ రీసోర్స్ పర్సన్లు ఇద్దరు ఉంటారు. వీరు నెలలో 16 రోజులు సేంద్రీయ సాగు చేస్తున్న క్షేత్రాలను సందర్శించి రైతులకు సూచనలు ఇస్తారు. ఇందుకు రోజుకు 300 రూపాయల చొప్పున వీరికి చెల్లిస్తారు.

హైదరాబాద్‌కు చెందిన సెంటర్ ఫర్ సస్టెయినబుల్ అగ్రికల్చర్ అనే ఎన్‌జీవో కృషి సఖి, రీసోర్స్ పర్సన్లకు సేంద్రీయ సాగుపై శిక్షణ ఇస్తుంది. అనంతరం వారు రైతులకు సాగు పద్ధతులను ఎప్పటికప్పుడు వివరిస్తూ వస్తుంటారు. ఆయా గ్రామాలకు చెందిన స్వయం సహాయ సంఘాల్లో సభ్యురాళ్లను కృషి సఖి, రీసోర్స్ పర్సన్లుగా ఎంపిక చేస్తారు. ప్రస్తుతం ప్రకృతి వ్యవసాయం చేసేందుకు ఆసక్తి చూపించే రైతుల ఎంపిక ప్రక్రియ జరుగుతున్నది. మరో వారం రోజుల్లో ఈ ఎంపిక పూర్తి చేస్తారు.

సొసైటీలు, ఎన్జీవోల ద్వారా బయో రీసోర్స్ సెంటర్లు

రైతులకు జీవామృతం లాంటివి తయారు చేసుకోవడానికి సంవత్సరానికి నాలుగు వేల చొప్పున రెండు సంవత్సరాలకు ప్రభుత్వం ఎనిమిది వేల రూపాయలు ఇస్తుంది. వీటిని తయారు చేసుకోలేని వారు వాటిని బయో రీసోర్స్ సెంటర్ల నుంచి తీసుకోవాల్సి ఉంటుంది.

జిల్లావ్యాప్తంగా 10 బయో రీసోర్స్ సెంటర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆసక్తి ఉన్న వారు వ్యక్తులుగాకాని, ఎన్‌జీవో లుగా కాని, సొసైటీలుగా కాని రీసోర్స్ సెంటర్లను ఏర్పాటు చేసుకోవచ్చు. త్వరలోనే ఈ సెంటర్లకు సంబంధించిన సమగ్ర వివరాలు వ్యవసాయశాఖకు అందే అవకాశం ఉందని మిగతా 8వ పేజీలో

● ఒక్కో క్లస్టర్‌లో 125 ఎకరాలు

జిల్లాలో ఉన్న 15 గ్రామీణ మండలాల్లో రెండు, మూడు గ్రామాలను కలిపి మండలానికి ఒక క్లస్టర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో క్లస్టర్ పరిధిలో ప్రకృతి వ్యవసాయం చేసేందుకు ఆసక్తి చూపించే 125 మంది రైతులను ఎంపిక చేసి 125 ఎకరాల్లో ఈ సేద్యాన్ని చేపడతారు. రైతులు ఎకరం విస్తీర్ణంలో తమకు నచ్చిన పంటను వేయవచ్చు. అది పూర్తిగా ప్రకృతి సేద్యం విధానాల ద్వారా మాత్రమే చేపట్టాల్సి ఉంటుంది. కూరగాయలు, పప్పు దినుసులు పండిస్తే లాభసాటిగా ఉంటుందని వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 15 క్లస్టర్లలో 1875 ఎకరాల్లో ప్రకృతి సేద్యాన్ని చేపట్టనున్నారు.

వివరాలు ఆన్‌లైన్ చేసేదెలా?

అంగన్‌వాడీల్లో పాత సెల్‌ఫోన్లతో సమస్యలు


విద్యార్థుల హాజరు నమోదు చేస్తున్న టీచర్

కరీంనగర్ రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు మెరుగైన సేవలందించాలనే ఉద్దేశంతో సిబ్బందికి ప్రభుత్వం స్మార్ట్ ఫోన్ అందజేసింది. కేంద్రల ద్వారా చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు అందుతున్న సేవలను అంగన్‌వాడీ టీచర్లు యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ ఫోన్లలో ఎక్కువగా స్టోరేజీ లేక పోవడంతోపాటు పాతవి కావడంతో వివరాల నమోదుకు అంగన్ వాడీ టీచర్లు ఇబ్బందులు పడుతున్నారు.

కేంద్ర ప్రభుత్వం పోషణ్ ట్రాకర్, రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌హెచ్‌టీఎస్ యాప్‌లో చిన్నారుల హాజరు, బరువు, ఎత్తు, బాలింతలు, పిల్లల నమోదు, ఇతర వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. విద్యార్థుల అటెండెన్స్ ముఖచిత్రం ద్వారా వేయాల్సి ఉంటుంది. కరీంనగర్ రూరల్ మండలంలో అంగన్‌వాడీ కేంద్రాలు 19 ఉన్నాయి. గర్భిణులు 110 మంది , బాలింతలు 91 మంది ఉండగా 0-6నెలల వయస్సు గల పిల్లలు 91 మంది ఉన్నారు. అలాగే 6నెలల నుంచి 3 సంవత్సరాల పిల్లలు 595 మంది ఉండగా మూడు నుంచి ఆరు సంవత్సరాలలోపు పిల్లలు 91 మంది ఉన్నారు. వీరి వివరాలు ఎప్పటి కప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. కేంద్రాల్లో సరుకులు పక్కదారి పట్టకుండా ఉండేందుకు ముఖచిత్ర నమోదుకు శ్రీకారం చుట్టారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఫేస్ రీడింగ్ తీసుకుని సరుకులు ఇవ్వాల్సి ఉంటుంది. ఫోన్లు సరిగా పని చేయకపోవడంతో టీచర్లు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.




ప్రభుత్వం ఇచ్చిన సెల్‌ఫోన్, సరుకుల పంపిణీ కోసం పిల్లల ఫేస్ రికగ్నిషన్ తీసుకుంటున్న అంగన్‌వాడీ టీచర్

క్షయ వ్యాధిగ్రస్తులు జాగ్రత్తలు తీసుకోవాలి

కరీంనగర్ రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): క్షయతో బాధపడే వారు జాగ్రత్తలు పాటిస్తే ఇతరులకు వ్యాధి సంక్రమించకుండా ఉంటుందని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ రవీందర్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో చామనపల్లి పీహెచ్‌సీలో టీబీ చాంపియన్స్ శిక్షణ శిబిరం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవీందర్ మాట్లాడుతూ ప్రభుత్వం క్షయ వ్యాధికి ఉచిత వైద్యం అందిస్తుందన్నారు. లక్షణాలు ఉన్న వారు వెంటనే నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. టీబీ నివారణలో అందరూ భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో చామనపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మనోహర్, టీబీహెచ్‌వీ రవీందర్, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, టీబీ అలర్ట్ ఇండియా సిబ్బంది వనిత, శ్రీను, రాజేందర్, అనిల్ పాల్గొన్నారు.

ప్రమాదాలకు గురైన కార్మికులకు ఎక్స్‌గ్రేషియా

కరీంనగర్ అర్బన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): అసంఘటిత రంగాల్లో పని చేస్తూ ప్రమాదానికి గురైన కార్మికులకు కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ ఎక్స్‌గ్రేషియా అందిస్తున్నదని జిల్లా ఉపకార్మిక కమిషనర్ కోల ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద 2021 ఆగస్టు 26 నుంచి 2022 మార్చి 31 మధ్యకాలంలో ఈ శ్రమ్ పోర్టల్లో పేరు నమోదు చేసుకున్న కార్మికులు ప్రమాదశాత్తు చనిపోతే నామినిలకు 2 లక్షలు, శాశ్వత అంగవైకల్యం పొందిన వారికి లక్ష రూపాయల ఎక్స్‌గ్రేషియా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్నదని తెలిపారు. జిల్లాలోని అర్హులైన అసంఘటిత కార్మికులు దరఖాస్తు సమర్పించేందుకు ఈ నెల 30 వరకు గడువు ఉందన్నారు. అర్హులైనవారు దరఖాస్తుతోపాటు మరణ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, ఈ శ్రమ్ కార్డు, ఎఫ్‌ఐఆర్, పంచనామా, పోస్టుమార్టం రిపోర్ట్, నామిని బ్యాంక్ అకౌంట్ వివరాలు జతచేయాలన్నారు. దరఖాస్తులను ఉపకార్మిక కమిషనర్ కార్యాలయం కరీంనగర్ (హౌస్ నెంబరు 7-2-1001, పొన్నం కాంప్లెక్స్, మంకమ్మతోట)లో అందజేయాలని సూచించారు.

లైన్‌మెన్ లేక ఇబ్బందులు

ప్రైవేట్ వ్యక్తులతో విద్యుత్ మరమ్మతులు

కరీంనగర్ రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో శాశ్వత లైన్‌మెన్‌లు లేక గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారు. చిన్నపాటి గాలి వచ్చినా.. వర్షం వచ్చినా గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. లైన్‌మెన్‌లు అందుబాటులో లేకపోవడంతో సరఫరాను పునరుద్ధరించేవారు లేక ఇబ్బంది పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు సంవత్సరాలుగా మండలంలోని దుర్శేడ్, చేగుర్తి గోపాల్‌పూర్, మందులపల్లి గ్రామాల్లో లైన్‌మెన్‌లు లేరు. విద్యుత్ శాఖ అధికారులు ప్రైవేట్ వ్యక్తులతో మరమ్మతులు చేయిస్తున్నారు. ఏదయినా అత్యవసర పరిస్థితి ఏర్పడితే విద్యుత్ శాఖ నుంచి ఒక్కరు కూడా అందుబాటులో ఉండరని, ఫోన్లు చేస్తే లిఫ్ట్ కూడా చేయరని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గురువారం ఉదయం ఆరు గంటల నుంచి దుర్శేడ్‌లో కొన్ని వార్డుల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సాయంత్రం వరకు కూడా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించలేదు. అనుభవం లేని వారితో మరమ్మతులు చేయించడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి.


దుర్శేడ్‌లో మరమ్మతులు చేస్తున్న ప్రైవేట్ కార్మికుడు

నిమిషాల్లో వాహనాలు మాయం

- కరీంనగర్‌లో వరుసగా బైక్, ఆటోల చోరీలు
- ఆగని సెల్‌ఫోన్ల దొంగతనం
- ఆందోళనలో బాధితులు



కరీంనగర్ క్రైం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా వాహనాల దొంగతనాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. రద్దీ ప్రాంతాల్లో ద్విచక్రవాహనాలు, ఆటోలు ఇతర వాహనాలు తరచూచోరీకి గురవుతున్నాయి. కొంత కాలం క్రితం జ్యోతినగర్ ప్రాంతంలో ఒక అపార్ట్‌మెంట్ సెల్లార్ నుంచి ఒక ఫోర్‌వీలర్‌ను దొంగలు అపహరించుకుపోయారు. ఇటీవల కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలు, కూరగాయల మార్కెట్ ప్రాంతంలో పార్క్ చేసిన ఆటోను గుర్తుతెలియని దొంగలు ఎత్తుకుపోయారు.

10 రోజుల క్రితం ఆర్టీసీ బస్టాండ్ వద్ద కృష్ణనగర్‌కు చెందిన ఒక వ్యక్తి తన బైక్‌ను పార్క్ చేసి కుటుంబ సభ్యులను బస్సు ఎక్కించాడు. తిరిగి వచ్చేసరికి బైక్ కనపడలేదు. రోజంతా వెదికినా ఆచూకీ లేకపోవటంతో బస్టాండ్ అవుట్‌పోస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నగరంలోని మాంగళ్యషాపింగ్ మాల్ సమీపంలో బెజ్జంకి మండలం రాంసాగరకు చెందిన యాదగిరి అనే ఆటోడ్రైవర్ మూడు రోజుల క్రితం తన ఆటోను రోడ్డు పక్కన పార్క్ చేసి సెల్‌ఫోన్ రిపేర్ చేయించుకునేందుకు వెళ్లాడు. వచ్చి చూసే సరికి ఆటో మాయమైంది. నాలుగు రోజుల క్రితం కూరగాయల మార్కెట్ ప్రాంతంలో శ్రీనివాస్ అనే ఒక పూల వ్యాపారి తన బైక్‌ను రోడ్డు పక్కన పార్క్ చేసి అరగంట తరువాత చూసే సరికి బైక్ కనిపించకుండా పోయింది. 10 రోజుల వ్యవధిలో ఈ ఘటనలు చోటు చేసుకోవడంతో వాహనా దారులు ఆందోళన చెందుతున్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో పదుల సంఖ్యలో బైక్‌లు చోరీకి గురయ్యాయి.

ఫిర్యాదు చేసినా నమోదు కాని కేసులు

బాధితులు బైక్‌లు చోరీకి గురైన సందర్భంలో పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నా కేసులు నమోదు చేయడం లేదు. బైక్ దొంగలు అరెస్టు అయిన సమయంలో కేసులు నమోదు చేసి రికవరీ చూపిస్తున్నారు. గతంలో దొంగతనాలకు పాల్పడిన నిందితులపై నిఘా పెట్టడం లేదనే విమర్శలున్నాయి. పగటి వేళ పోలీస్ పెట్రోలింగ్ లేకనే దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయనే విమర్శలు వస్తున్నాయి. పెట్రోలింగ్ పార్టీలు, బ్లూకోల్ట్స్ పెట్రోలింగ్ పనితీరును మెరుగుపరచి, నిఘా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. నగరంలోని ముఖ్య కూడళ్లు, వాణిజ్య కేంద్రాల వద్ద అనునిత్యం పోలీసు నిఘాను ఏర్పాటు చేయాలని నగరవాసులు కోరుతున్నారు.

రద్దీ ప్రాంతాల్లో సెల్‌ఫోన్ల చోరీ

నగరంలోని రద్దీ ప్రాంతాలైన కూరగాయల మార్కెట్, టవర్‌సర్కిల్, రాజీవ్ చౌక్, ప్రకాశంగంజ్, బస్టాండ్ ప్రాంతాల్లో సెల్‌ఫోన్ల చోరీ పెరిగిపోయింది. ఎక్కువ శాతం మొబైల్‌ఫోన్‌లు ఉదయం వేళ కూరగాయాల మార్కెట్‌లో చోరీకి గురవుతున్నాయి. కొన్ని ఇతర రాష్ట్రాల ముఠాలు ఈ సెల్‌ఫోన్లను చోరీ చేసి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నట్లు గతంలో పోలీసుల విచారణలో వెల్లడైంది. గతంలో ఇటువంటి దొంగలపై పీడీ యాక్టు నమోదు చేసి జైలుకు పంపించటంతో కొంత కాలం వరకు చోరీలు తగ్గాయి. ఇటీవలి కాలంలో మళ్లీ పెరిగిపోయాయి. ఎవరికి అనుమానం రాకుండా కొన్ని దొంగల ముఠాలు మైనర్లతో సెల్ ఫోన్‌లను చోరీ చేయిస్తున్నట్లు తెలుస్తోంది. వారిని అరెస్టు చేసినా చిన్న చిన్న శిక్షలతో బయటకు వచ్చి మళ్లీ దొంగతనాలు చేస్తున్నారు. ఆధునిక సాంకేతికతో పోయిన ఫోన్లు దొరుకుతున్నా నిందితులు పోలీసులకు చిక్కడం లేదు. పోలీసులు స్పందించి నిఘా పెట్టి దొంగతనాలు జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

విడదీసి విక్రయం

పోలీసులు వాహనాల దొంగలను అరెస్టు చేసి జైలుకు పంపిస్తున్నప్పటికీ పూర్తి స్థాయిలో నియంత్రించడం సాధ్యం కావడం లేదు. వాహనాల దొంగలు బైక్‌లను అపహరించిన తరువాత శివారు ప్రాంతాలకు తీసుకుపోయి విడి భాగాలుగా వేరు చేసి పాత సామగ్రి షాపుల్లో విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. బైక్‌లు, ఆటోలను దొంగిలిస్తున్న వాహనాల దొంగలు ఇందనం అయిపోయే వరకు తిరిగి వాటిలోని విలువైన భాగాలు తీసుకెళ్లి వాహనాలను నగర శివారులో వదిలి వెళుతున్నారు. కరీంనగర్ బస్‌స్టేషన్, జిల్లా పరిషత్ కార్యాలయం, టవర్ సర్కిల్, రాజీవ్ చౌక్, కోర్టు చౌరస్తా, మంచిర్యాల చౌరస్తాల్లో రోడ్డు పక్కన నిలిపిన బైక్‌ల హ్యాండిల్‌లాక్‌ను తొలగించి చోరీ చేస్తున్నారు. మరికొన్ని సందర్భాల్లో బైకుల్లో ఉన్న బ్యాటరీలు చోరీకి గురవుతున్నాయి. బైక్‌ల నుంచి వేరు చేసిన విడిభాగాలను ఇతర ప్రాంతాల్లోని సెకండ్ సేల్స్ వ్యాపారులకు, సర్వీసింగ్ సెంటర్లలో, చివరకు పాత సామగ్రి దుకాణాలలో విక్రయిస్తున్నారు. దీంతో వాహనదారులు తీవ్రంగా నష్టపోతున్నారు.



మద్యం మత్తులో బైక్‌కు నిప్పంటించిన యువకుడు



దగ్ధమవుతున్న బైక్

మల్యాల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం రాజారంలో మద్యం మత్తులో ఓ వ్యక్తి గురువారం తన ద్విచక్రవాహనాన్ని దహనం చేశాడు. జగిత్యాల మండలం టీఆర్‌నగర్‌కు చెందన కలీం అనే వ్యక్తి రాజారంలోని హనుమాన్ ఆలయం వద్ద తన పల్సర్ వాహనాన్ని స్టార్ట్ చేయడానికి ప్రయత్నించాడు. అది స్టార్ట్ కాకపోవడంతో మద్యం మత్తులో ఉన్న అతడు దానికి నిప్పటించాడు. దీంతో మంటలు చెలరేగగా స్థానికులు జగిత్యాలలోని ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. వాహనం పూర్తిగా దగ్ధం అయినట్లు స్థానికులు తెలిపారు.

చిన్నబోనాల శివారులో చిరుత సంచారం..

● పాదముద్రలను గుర్తించిన రైతులు



చిన్నబోనాల శివారులోని పొలంలో చిరుత అడుగులు

సిరిసిల్ల రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్లఅర్బన్ పరిధిలోని చిన్నబోనాల గ్రామశివారులోని వ్యవసాయ పొలాల్లో చిరుతపులి సంచరిస్తుండడంతో రైతులు భయంతో వణికిపోతున్నారు. చిన్నబోనాల గ్రామ శివారులోని సుద్దగండి ప్రాంతంలోని వ్యవసాయపొలాల్లో గురువారం తెల్లవారు జామున చిరుతపులి పాదముద్రలను రైతులు గుర్తించారు. ఈ విషయాన్ని రైతులు తాజా మాజీ కౌన్సిలర్ బోల్లం నాగరాజుగౌడ్ దృష్టికి తీసుకరావడంతో అక్కడివెళ్లి పరిశీలించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీశాఖ అధికారులు అక్కడివెళ్లి అడుగులను పరిశీలించి చిరుతపులి అడుగులుగా గుర్తించారు. రాత్రిపూట రైతులు వ్యవసాయ పొలాల వైపు వెళ్లవద్దని అటవీశాఖ అధికారులు కోరారు. ఎలాగైనా చిరుతను పట్టుకోవాలని రైతులు కోరుతున్నారు.

మహిళ అదృశ్యం.. కేసు నమోదు

శంకరపట్నం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళఅదృశ్యంపై కేశవపట్నం పోలీస్ స్టేషన్లో కేసునమోదైన సంఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామానికి చెందిన బొంతల లావణ్య ఈ నెల10న ఇంటినుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. లావణ్య భర్త రాజు చుట్టు పక్కల, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఎలాంటి ఆచూకీ దొరకలేదు. దీంతో రాజు కేశవపట్నం పోలీస్ స్టేషన్లో లావణ్య అదృశ్యమైనట్లు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు మిస్సింగ్ కేసునమోదు చేసుకొనిదర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తడి ఆరని కన్నీటి ధార..

నేడు అంతర్జాతీయ శరణార్థుల దినోత్సవం

అంతర్జాతీయ శరణార్థుల దినోత్సవాన్ని అంతర్గాం కాందిశీకులు జరుపుకోవ డానికి సిద్ధపడుతున్నారు. ఐదు దశాబ్దాలుగా పునరావాస సంక్షేమ పథకాలకు నోచుకోవడం లేదు. మిల్లుల మూసివేతతో ఉపాధి కోల్పోయి నిరుద్యోగం, ఆకలి, అనారోగ్యాలతో బతుకు భారమై కాలం వెళ్లదీస్తున్నారు. ప్రభుత్వాలు, పాలకులు, అధికారులు ఇప్పటికైనా ఆదు కోవాలని వారు వేడుకుంటున్నారు. ఈ అంతర్జాతీయ శరణార్థుల దినోత్సవం నుండైనా అణగారిన అంతర్గాం కాందిశీలకుల జీవితాల్లో వెలుగులు నిండాలని ఆశిద్దాం...

● ఐదు దశాబ్దాలుగా అంతర్గాం కాందిశీకుల ఆర్తనాదాలు

● ఏళ్లు గడిచినా పరిష్కారానికి నోచుకోని సమస్యలు

గోదావరిఖని, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కాందీశీకులు కన్నీటి ధారలు ఆరడం లేదు.. వారిని కరుణించిన ప్రభుత్వాలే కన్నీట ముంచాయి... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విజయవాడ, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలు శ్రీలంక, బర్మాకు (మయన్మార్) బతుకుదెరువు కోసం వలస వెళ్లారు. 1970 ప్రాంతంలో అక్కడ కరువు ఏర్పడడంతో భారత ప్రభుత్వం వారిని కాందీశీకులుగా తీసుకువచ్చి దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉపాధి కల్పించింది. ఈ క్రమంలో పెద్దపల్లి జిల్లా అంతర్గాంలో స్పిన్నింగ్, వీవింగ్ మిల్లులు ఏర్పాటు చేసి వెయ్యి మందికి ఉపాధి కల్పించింది. వీవింగ్ మిల్లులో 509 మంది, స్పినింగ్ మిల్లులో 434 మంది కాందీశీకులు ఉద్యోగాలు చేశారు. అంతర్గాంలో కార్మికుల కోసం క్వార్టర్లు, ఇతర వసతులు కల్పించారు. 90వ దశకం వరకు అంతా సాఫీగా జరిగింది.



మూతపడిన స్పిన్నింగ్ మిల్లు

● మిల్లుల మూసివేతతో కష్టాలు

యాజమాన్య లోపాలు, అవినీతి వల్ల స్పిన్నింగ్, వీవింగ్ మిల్లులు నష్టాల పాలయ్యాయి. 1989లో వీవింగ్ మిల్లును మూసివేశారు. దీంతో కార్మికులు ఉపాధి కోల్పోయారు. ఇందులో పని చేసిన 197 మంది కాందిశీకులు దుర్భర దరిద్ర్యాన్ని, వృద్ధాప్యాన్ని అనుభవిస్తున్నారు. 162 మంది కార్మికుల కుటుంబాలు వివిధ కారణాలతో మృతి చెందారు. స్పిన్నింగ్ మిల్లును 1991లో లే ఆఫ్ ప్రకటించి మూసివేశారు. ఇందులో పని చేసిన 434 మంది కార్మికులు రోడ్డున పడ్డారు.

● లక్ష్మీ స్పిన్నింగ్ మిల్లులో 1970 నుంచి 1991 వరకు కార్మికురాలిగా పని చేసింది. అంతర్గాంలో అప్పుడు ఆమెకు క్వార్టర్ ఇచ్చారు. ఆ పునరావాస కాలనీలో ఉన్న క్వార్టర్ 1994లో కూలి పోయింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు తమ బకాయిలు వస్తాయని ఎదురు చూస్తున్న లక్ష్మి అదేస్థలంలో ఓ రేకుల షెడ్డు వేసుకుని జీవిస్తున్నది.

ఈ రెండు మిల్లుల కార్మికుల వేతనాల బకాయిల కూడా చెల్లించలేదు. క్వార్టర్లు శిథిలమయ్యాయి. ఆ స్థలాలకు పట్టాలు ఇవ్వలేదు. దీంతో వారికి నిలువ నీడ కరువైంది.



మూతపడిన వీవింగ్ మిల్లు

ఇళ్లన్నా ఇవ్వండి..: రామారావు, బర్మ, శ్రీలంక కాందిశీకుల సంఘం ప్రధాన కార్యదర్శి



జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ ప్రభుత్వాలు బర్మ, శ్రీలంక కాందిశీకులకు అంతర్గాంలో పునరావాసం కల్పించాయి. 350 ఎకరాల్లో వెయ్యి ఇళ్లు కట్టి వెయ్యి మందికి ఉపాధి కల్పించింది. ఇప్పుడు అంతర్గాం మిల్లులకు సంబంధించి భూములన్నీ అన్యాక్రాంతమవుతున్నాయి. అక్రమార్కులు కబ్జాలకు పాల్పడుతున్నారు. 50ఏళ్ల తరువాత కూడా కాందిశీకులం పునరావాసం కోసం వేడుకుంటున్నాం. ఉపాధి, ఉద్యోగాలు కల్పించడం సాధ్యం అయినా, కాకపోయినా తలదాచుకునేందుకు ఇంటి స్థలాన్ని, ఇల్లును ఇప్పించాలని కోరుకుంటున్నాను.

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన కారు..

● ఒకరి మృతి



నరేశ్(ఫైల్)

తంగళ్లపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం నేరెళ్ల గ్రామశివారులో ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో ఒకరు మృతిచెందారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. వేములవాడ మండలం చింతల్‌ఠాణ ఆర్అండ్ఆర్‌కాలనీకి చెందిన కుర్మ నరేశ్(36) ద్విచక్రవాహనంపై చిన్నలింగపూర్‌లో రైల్వేలైన్ పనులు చేయడానికి వెళ్తున్నాడు. ఎదురుగా వచ్చిన కారు ఢీకొనడంతో నరేశ్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే 108 వాహనంలో జిల్లా ప్రధానఆసుపత్రికి తరలించి చికిత్సచేస్తుండగా మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య మమత, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు.

వివాహిత ఆత్మహత్య

వీణవంక, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామానికి చెందిన ఆరెపల్లి అనూష(26) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోగా చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసుల కథనం ప్రకారం.. అనూష కొంతకాలంగా అత్తగారింటికి వెళ్లకుండా తల్లిదండ్రుల వద్దే ఉంటోంది. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు పలుమార్లు అత్తగారింటికి వెళ్లాలని సూచించించారు. అత్తగారింటికి వెళ్ళడం ఇష్టంలేక అనూష 16వతేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు వరంగల్ ఆసుపత్రికి తరలించగా బుధవారం చికిత్స పొందుతూ మృతిచెందింది. అనూష తండ్రి చిలువేరు నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎరువుల దుకాణాలపై టాస్క్‌ఫోర్స్ దాడి



ముస్తాబాద్ ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

ముస్తాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ముస్తాబాద్ మండల కేంద్రంలోని ఎరువులు, విత్తనాలపై టాస్క్‌ఫోర్స్ అధికారులు ఎస్సై గణేశ్, మండల వ్యవసాయాధికారి దుర్గరాజు, తంగళ్లపల్లి వ్యవసాయాధికారి సంజీవ్‌లు గురువారం తనిఖీచేశారు. మండల కేంద్రంలోని పలుదుకాణాల్లో లైసెన్స్‌లు, స్టాక్ రిజిష్టర్లు, బిల్ బుక్కులు తనిఖీ చేశారు. డీలర్లు నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు అమ్మవద్దని హెచ్చరించారు. రశీదు లేకుండా ఏది అమ్మవద్దని, రైతులకు ఉపయోగపడే వాటినే విక్రయించాలని సూచించారు. అక్రమంగా నిలువ ఉంచిన విత్తనాలను అమ్మితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

గ్రామపంచాయతీ ఎదుట మహిళల బైఠాయింపు



ఓదెల గ్రామపంచాయతీ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న మహిళలు

ఓదెల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట గురువారం 10వ,వార్డు మహిళలు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. కొద్ది రోజులుగా నిర్వహిస్తున్న రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా మురికి కాలువల నిర్మాణం చేపట్టారని, ఇందులో మంచినీటి నల్లాల మరమ్మతులు చేపట్టలేదని మహిళలు తెలిపారు. మురికి కాలువల్లో నల్లాల నీరు వృథాగా పోతుండడంతో కాలువలు నిండి నీటినిలువతో దుర్వాసన, దోమలు అధికమవుతున్నాయని తెలిపారు. నీటినిలువ ఉండకుండా మంచినీటి నల్లాల మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కరీంనగర్ క్రైం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను తర లిస్తున్న ఒక ట్రాక్టర్‌ను గురువారం ఖాజీపూ ర్‌లో పట్టుకున్నామని కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మందుబాబుల ఆగడాలు

● పాఠశాల మైదానాలు, పల్లెప్రకృతి వనాల్లో అడ్డా ● ప్రమాదకరంగా పగిలిన గాజుముక్కలు

● ఆందోళన చెందుతున్న విద్యార్థులు, ప్రజలు ● గస్తీ ఏర్పాటు చేయాలని వేడుకోలు



ఎల్ఎండీలోని శిశుమందిర్ పాఠశాల మైదానంలో తాగి పగలకొట్టిన మద్యం సీసాల ముక్కలు



ఎల్ఎండీలోని పాఠశాల మైదానంలో వెలుతురు కోసం వేసిన మంట, అందులో వేసిన ఖాళీ మద్యం సీసాలు

తిమ్మాపూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్ఎండీకాలనీ మందుబాబులకు అడ్రస్‌గా మారింది. ఉదయం, సాయంత్రం తేడాలేకుండా మందుబాబులు మందు తాగేందుకు పాఠశాలలు, కూలిన ఎస్ఆర్ఎస్పీ క్వాటర్లు, పల్లె ప్రకృతివనాలను అడ్డాలుగా మార్చుకుంటున్నారు. రాత్రి అయిందంటే చాలు ద్విచక్రవాహనాలు, కార్లలో వచ్చి ఈస్థలాల్లో మద్యం తాగుతూ ఉంటారు. మద్యం బాటిళ్లను పగలగొట్టి వెళుతుండటంతో గాజుముక్కలు ప్రజలకు ప్రమాదంగా మారుతు న్నాయి. ఉదయం వాకర్స్, మైదానంలో ఆటలు ఆడేవారు ఈ మద్యం సీసా ముక్కలతో ఇబ్బంది పడుతున్నారు. ఎక్కడ గుచ్చుకుంటాయోనని ఆందోళనచెందుతున్నారు. రాత్రి సమయంలో అటువైపుగా విద్యుత్‌దీపాలు సరిగా లేకపోవడంతో చీకట్లో మందుబాబులు ఆడిందే ఆటగా మారిందని స్థానికులు అంటున్నారు. రాత్రి సమయాల్లో బయటకు వెళ్లేందుకు భయమేస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పోలీసులు ఇటువైపు ప్రత్యేకంగా గస్తీ ఏర్పాటు చేసి మందుబాబుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

కరీంనగర్ క్రైం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌కు చెందిన కందుల యశ్వంత్ కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ గ్రామంలో ఏప్రిల్‌9న తన సెల్‌ఫోన్ పోగొట్టుకోగా వెంటనే కరీంనగర్‌రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీఈఐఆర్ పోర్టల్‌ను ఉపయోగించి ఫోన్‌ను రికవరీ చేశారు. కరీంనగర్ రూరల్ సీఐ ఎ నిరంజన్‌రెడ్డి గురువారం ఫోన్‌ను బాధితుడికి అందజేశారు. ఫోన్‌ను గుర్తించి, స్వాధీనం చేసుకోవటంలో కృషి చేసిన కానిస్టేబుల్ విశ్వతేజను సీఐ అభినందించారు.



బాధితుడికి సెల్‌ఫోన్‌ను అప్పగిస్తున్న సీఐ నిరంజన్‌రెడ్డి

హత్య కేసులో ఇద్దరికి ఏడేళ్ల జైలు

జగిత్యాల క్రైం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో గొడవపడి వ్యక్తి మృతికి కారణమైన ఇద్దరికి ఏడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.3 వేల చొప్పున జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి రత్న పద్మావతి గురువారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం రాయికల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ధర్మాజీ పేటకు చెందిన సావన్‌పెల్లి శేఖర్(28) అనే వ్యక్తి వ్యవసాయం చేసుకుంటూ తన కుటుంబాన్ని పోషిస్తున్నాడు. 2022 మార్చి 22న శేఖర్ తన మిత్రుడు నాగభూషణంతో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో వెతకగా గ్రామ శివారులో శేఖర్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు గుర్తించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై కిరణ్ కుమార్ కేసు నమోదు చేయగా జగిత్యాల రూరల్ సీఐ కృష్ణ కుమార్ దర్యాప్తు చేశారు. పోలీసుల దర్యాప్తులో శేఖర్ అనే వ్యక్తిని అతడి స్నేహితులు రస రాజేశం, బలిజ నాగభూషణంలు మద్యం మత్తులో గొడవ పడి పదునైన ఆయుధంతో పొడిచి హత్యకు పాల్పడ్డట్లు గుర్తించారు. ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై శ్రీకాంత్, కోర్టు డ్యూటీ అధికారులు నరేష్, కిరణ్ కుమార్‌లు సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ మల్లిఖార్జున్ కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ఇద్దరు ముద్దాయిలు రాజేశం, నాగభూషణంలకు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. ముద్దాయిలకి శిక్ష పడడంలో కృషి చేసిన పోలీస్ అధికారులను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

చోరీ కేసులో నిందితుడికి 6 నెలల జైలు

కరీంనగర్ క్రైం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలోని శ్రీ శివభక్తి ఆంజనేయ స్వామి దేవాలయంలో పంచలోహ విగ్రహం, గోముఖం, ఇతర వస్తువులు దొంగత నానికి పాల్పడిన కేసులో నిందితుడు గట్టుబూత్కూర్‌కు చెందిన ఎగుర్ల గట్టయ్యకు కరీంనగర్ ఏడీఎం కోర్టు మెజిస్ట్రేట్ 6 నెలల జైలుశిక్ష, 400 రూపాయల జరిమానా విధించారని కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. చోరీ కేసులో నిందితు డిని జనవరి 6న అరెస్టు చేయగా గురువారం తీర్పు వెలువడిందని తెలిపారు. నిందితుడికి శిక్ష పడటంలో కృషి చేసిన కొత్తపల్లి ఎస్ఐ సాంబమూర్తి, కోర్టు కానిస్టేబుల్ మౌనికలను సీఐ అభినందించినట్లు తెలిపారు.

రూ.7400 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, జూన్ 19 (ఆంధ్ర జ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7400 పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు ఐదుగురు రైతులు 76క్వింటాళ్లు విడి పత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్‌ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7400, కనిష్ఠ ధర రూ.7200 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

ఎనిమిదేళ్లుగా రేషన్‌కార్డు కోసం ఎదురుచూపులు

● బియ్యం కోసం ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబం



ఇంటి ఎదుట పిల్లలతో మౌనిక, సహదేవ్ దంపతులు

చిగురుమామిడి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): చిగురుమామిడి మండలంలోని రామంచ గ్రామానికి చెందిన దర్శనం మౌనిక-సహదేవ్ దంపతులు ఎనిమిది సంవత్సరాలుగా రేషన్‌కార్డు కోసం ఎదురుచూస్తున్నారు. రోజుకూలి చేసుకునే వీరిది పేద కుటుంబం. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. పేదప్రజలకు ఇచ్చే రేషన్ కార్డులు అర్హులకు అందడం లేదనడానికి వీరు ప్రత్యక్ష ఉదాహరణ. రోజువారి ఆహారం కోసం దుకాణాల్లో డబ్బులుపెట్టి బియ్యం కొని తెచ్చుకుంటున్నారు. దీంతో కూలి డబ్బులుకాస్తా తినే తిండికే సరిపోతున్నాయని వారు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు.

● కూలి డబ్బులు బియ్యానికే సరిపోతున్నాయి..

- దర్శనం మౌనిక-సహదేవ్..

మేము అనేక సంవత్సరాలుగా రేషన్‌కార్డు కోసం దరఖాస్తులు చేసుకుంటూనే ఉన్నాం. ఐనప్పటికీ మాకు రేషన్‌కార్డు రాలేదు. రోజు కూలి పనులు చేసుకుంటూ వచ్చిన డబ్బులతో సగం డబ్బుతో బియ్యం తీసుకువచ్చి కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. చేతికి పని దొరకని రోజు పస్తులుండుడే. అధికారులు మాపై దయ చూపి రేషన్‌కార్డు ఇచ్చి ఆదుకోవాలి.

పనిదొరకని రోజు పిల్లలు వారు పస్తులుండాల్సిన పరిస్థితి. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి అర్హులైన వారిని గుర్తించి రేషన్‌కార్డులు అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

బావిలో పడి ఒకరి మృతి

ధర్మారం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సింగాపూర్ గ్రామా నికి చెందిన గొర్ల కాపరి పెద్ది మల్లయ్య(61) ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. గురువారం ఉదయం గొర్ల కాపలకు గ్రామ శివారులోకి వెళ్ళాడు. ఎండ తీవ్రత అధికంగా ఉండగా బావి వద్ద ఉన్న చెట్టుకింద సేదదీరుతూ అందులో పడి మృతి చెందాడు. మిగితా కాపర్లు వచ్చి చూసే సరికి బావిలో చెప్పులు తేలి ఉండడం, కర్ర బావి వద్ద ఉండడంతో అందులో పడినట్లు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మల్లయ్య భార్య పెద్ది పోశవ్వ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు.

సుడా నిధులతో గ్రామాల అభివృద్ధి

● గుండ్లపల్లి స్టేజివద్ద వీధి దీపాలను ప్రారంభించిన ఎమ్మెల్యే, సుడా చైర్మన్



స్ట్రీట్ లైట్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

గన్నేరువరం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సుడా నిధులతో సుడా పరిధిలోని గ్రామాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని గుండ్లపల్లి స్టేజి నుండి గన్నేరువరానికి వెళ్లే ప్రధాన రహదారిలో రూ.20లక్షల సుడా నిధులతో ఏర్పాటు చేసిన వీధిదీపాలను సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డితో కలిసి ఆయన గురువారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుడా పరిధిలోని గ్రామాలకు మహర్దశ పట్టనున్నదని అన్నారు. సుడా నిధులతో నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులను చేపట్టామని అన్నారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ సుడా పరిధిలోని అన్ని గ్రామాలను అభివృద్ధి పరిచేందుకు నిధుల మంజూరుకు కృషిచేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, నాయకులు అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, కొమ్మెర రవిందర్ రెడ్డి, ముల్కల మల్లేశం, బేతెల్లి రాజేందర్‌రెడ్డి, వంగల సత్తిరెడ్డి, బొల్లి శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

అటవీ ప్లాంటేషన్ సర్వేను అడ్డుకున్న రైతులు

● వెనుదిరిగిన అధికారులు



రోడ్డుపై బైఠాయించిన రైతులు

వీర్నపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం రంగంపేట గ్రామంలో 30ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్న అటవీభూముల్లో ప్లాంటేషన్ కోసం సర్వే చేయద్దని అటవీ శాఖ అధికారులను రైతులు అడ్డుకున్నారు. తమ భూముల్లో సర్వే చేయద్దంటూ రైతులు రోడ్డుపై బీష్మించుకు కూర్చున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంత అటవీ భూమిసాగులో ఉందని తెలుసు కునేందుకే సర్వే చేస్తున్నామని అల్మాస్‌పూర్, గొల్లపల్లి సెక్షన్ అధికారులు పద్మలత, సక్కారాం రైతులకు వివరించారు.

అయినా రైతులు ఒప్పుకోకపోవడంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. రైతులు వినిపించుకోకపోవడంతో అధికారులు వెనుదిరిగి వెళ్లిపోయారు. ఉన్నతాధికారులకు సమాచారాన్ని అందించి తదుపరి చర్యలు తీసుకుంటామని అధి కారులు తెలిపారు. రాత్రిపూట భూములను సాగు చేయకుండా బేస్ క్యాంపు సిబ్బంది, వాచర్లు గస్తీ నిర్వహిస్తున్నారు.

వేములవాడలో ముగిసిన కూల్చివేతలు

● మిగిలిన శిథిలాల తొలగింపు



కూల్చివేతలో భాగంగా సగం తొలగించిన భవనం

వేములవాడ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ పట్టణంలోని ప్రధానరహదారి విస్తరణలో భాగంగా చేపట్టిన ఇళ్లు, భవనాల కూల్చివేత పనులు దాదాపుగా పూర్తయ్యాయి. రాజరాజేశ్వర స్వామివారి దేవస్థానం ముందు నుంచి మూలవాగు బ్రిడ్జి వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న నిర్మాణాలను తొలగించే ప్రక్రియను అధికార యంత్రాంగం ఆదివారం ప్రారంభించగా, బుధవారం రాత్రికి కూల్చివేతలు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఉన్న రోడ్డును 80అడుగుల మేరకు విస్తరించే క్రమంలో 243ఇళ్లను తొలగించాల్సి ఉండగా, ఇందులో 80ఇళ్లకు సంబంధించిన యజమానులు కోర్టును ఆశ్రయించి స్టేపొందడంతో వాటిని మినహాయించి మిగతా వాటిని అధికారులు కూల్చివేశారు. రోడ్ల వెడల్పుకోసం సేకరించాల్సిన స్థలంమేరకు మార్కింగ్ చేసి ప్రొక్లెయినర్లతో కూల్చివేశారు. మిగిలిపోయిన నిర్మాణం సైతం దెబ్బతినే అవకాశం ఉండడంతో కొందరు ఇంటియజమానులు నష్టపోయే భాగాన్ని కూల్చివేసేందుకు తమకే అవకాశం ఇవ్వాలని కోరడంతో అధికారులు అందుకు అంగీకరించారు. పాక్షికంగా కోల్పోతున్న ఇళ్లు, ఇతర నిర్మాణాలలో సంబంధిత యజమానులు కూలీల సహాయంతో తొలగింపు పనులు చేపట్టారు. ఇదిలాఉండగా ఇప్పటివరకు కూల్చివేత పూర్తయిన వాటికి సంబంధించిన శిథిలాలను తరలించాల్సి ఉండగా, అందుకు సంబంధిత నిర్మాణాల యజమానులకే అవకాశం ఇచ్చామని మున్సిపల్ కమిషనర్ అన్వేష్ తెలిపారు. ఇందుకోసం నాలుగు రోజులు సమయం ఇస్తున్నామని, అప్పటిలోగా శిథిలాలు తరలించాలని లేనిపక్షంలో తామే శిథిలాలను తరలిస్తామని ఆయన స్పష్టం చేశారు.

ఉమ్మడి నాలుగు జిల్లాల వాలీబాల్ పోటీలు ప్రారంభం



వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న పుట్ట మధు

పెద్దపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పరికిపండ్ల నరహరి ఐఏఎస్ తండ్రి పరికిపండ్ల సత్యనారాయణ జ్ఞాపకార్థం ఆలయఫౌండేషన్ ఆధ్వర్యంలో బసంత్‌నగర్‌లో ఉమ్మడి నాలుగు జిల్లాల వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. గురువారం ప్రారంభమైన ఈపోటీలకు ముఖ్య అతిథులుగా మాజీ జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, బీఆర్ఎస్ నాయకులు కౌశిక్ హరి, బీజేపీ నాయకురాలు కందుల సంధ్య రాణి, బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష హాజరయ్యారు. వారు మాట్లాడుతూ యువతలో క్రీడా స్ఫూర్తి పెంపొందించేందుకు ఇలాంటి టోర్నమెంట్లు ఎంతగానో దోహదపడతాయని అభిప్రాయపడ్డారు. మూడు రోజులపాటు జరిగే ఈ పోటీలకు ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్, నిజామాబాద్ జిల్లాల నుంచి 32జట్లు పాల్గొంటున్నాయి. ఆలయ ఫౌండేషన్ సీఈవో రమేశ్ బాబు, అడిషనల్ సీఈవో మిట్టపల్లి రాజేంద్ర కుమార్, డిప్యూటీ సీఈవో కీర్తి నాగార్జున, ఫౌండేషన్ సభ్యులు పరికిపండ్ల రాము, లక్ష్మణ్, పుప్పాల దయానంద్, రామస్వామి, సోము శ్రీనివాస్, జాగిరి శ్రీకాంత్, కన్నం వెంకటేష్, కమలాకర్ రెడ్డి, శ్రీనివాస్, తెలంగాణ రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్, పెద్దపల్లి జిల్లా వాలీబాల్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు

● ఎస్పీ అశోక్ కుమార్



వాహనానికి నంబరు ప్లేట్ బిగిస్తున్న పోలీసులు

జగిత్యాల క్రైం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): నంబర్ ప్లేట్ లేకుండా, కొత్త వాహనాలకు రిజిస్ట్రేషన్ చేయించకుండా నడిపితే చర్యలు తప్పవని ఎస్పీ అశోక్ కుమార్ హెచ్చరించారు. ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాలమేరకు జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో గురువారం పోలీసులు స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. ఈసందర్భంగా నంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడుపుతున్న 306వాహనదారులను గుర్తించి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వాహన నంబర్లను ట్యాంపరింగ్‌చేస్తే వాహనాలను సీజ్‌చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పని సరిగా పాటించాలని ఎస్పీ కోరారు.



ఆర్చరీ అకాడమీ ప్రారంభానికి సిద్ధమైన మినీ స్టేడియం

సిరిసిల్ల జిల్లాకు ఆర్చరీ అకాడమీ

నేడు ప్రారంభించనున్న రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్

సిరిసిల్ల టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో వాలీబాల్ అకాడమీకి అనుమతులు లభించాయి. గత సంవత్సరం నుంచే జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి అజ్మీరా రాందాస్, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చెన్నమనేని శ్రీకుమార్ జిల్లా కేంద్రంలో ఆర్చరీ అకాడమీ ఏర్పాటుకు ప్రయత్నాలు చేశారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ చొరవతో ఎట్టకేలకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ నుంచి ఆర్చరీ అకాడమీ ఏర్పాటుకు సానుకూలంగా స్పందన వచ్చింది. ఇటీవల సిరిసిల్ల మినీ స్టేడియంలో ఆర్చరీ అకాడమీ ఏర్పాటుకు, విద్యార్థుల శిక్షణకు కావాల్సిన సౌకర్యాలను స్పోర్ట్స్ అథారిటీ అధికారులు పరిశీలించారు. అనుకూల వాతావరణం ఉండడంతో ఆర్చరీ అకాడమీ ఏర్పాటుకు అనుమతులను మంజూరు చేశారు. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో ఆర్చరీ అకాడమీని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ శివసేనారెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ప్రారంభించనున్నారు. అకాడమీ ప్రారంభోత్సవం అనంతరం ఆర్చరీ అకాడమీలో చేరికలకు 14 నుంచి 16 ఏళ్లలోపున్న 20 మంది విద్యార్థులను ఎంపిక చేయనున్నారు.

కబడ్డీ అకాడమీ మంజూరు చేయాలి

మదన్, కబడ్డీ అసోసియేషన్ సహాయ కార్యదర్శి



గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా కబడ్డీ క్రీడకు ప్రాధాన్యం ఉంది. కబడ్డీ క్రీడకు ప్రభుత్వాలు ప్రోత్సాహం అందించాలి. జిల్లాలో వాలీ బాల్, అర్చరీ అకాడమీ రావడం ఆనందంగా ఉంది. జిల్లాలో కబడ్డీ అకాడమీని మంజూరు చేయాలి. కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ప్రత్యేక క్రీడా శిబిరాలతో శిక్షణ ఇస్తున్నాం. ప్రభుత్వం, అధికారులు కూడా ప్రోత్సాహం అందిస్తే జాతీయ స్థాయిలో క్రీడాకారులు రాణిస్తారు.

మరిన్ని క్రీడా అకాడమీలు రావాలి..

సీహెచ్ శ్రీకుమార్, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు



రాజన్న సిరిసిల్ల జిల్లాకు మరిన్ని క్రీడా అకాడమీలు రావాలి. క్రీడలకు పుట్టినిల్లు అయిన రాజన్న సిరిసిల్ల జిల్లాలో క్రీడాకారులకు కొదవలేదు. గ్రామీణ స్థాయి నుంచి జిల్లా కేంద్రం వరకు ప్రతి క్రీడలో క్రీడాకారులు ప్రావీణ్యం సాధిస్తున్నారు. ప్రభుత్వం, జిల్లా అధికా రులు మరింత ప్రోత్సాహం ఇస్తే జాతీయ స్థాయిలో విజయాలను సాధిస్తారు. వాలీబాల్ అకాడమీతో పాటు అర్చరీ అకాడమీ ప్రారంభం కానుండడం ఆనందంగా ఉంది.

విలోచవరంలో పోచమ్మ బోనాలు

మంథనిరూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విలోచవరంలో గురువారం పోచమ్మతల్లికి సామూహిక బోనాలను సమర్పించారు. వర్షాకాలం పంటల సాగు ముందు పిల్లా పాపలతో గ్రామంలోని పోచమ్మ తల్లికి బోనాన్ని నైవేద్యంగా సమర్పిస్తారు. గ్రామస్థులంతా డప్పుల చప్పుళ్లతో గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలో ఉన్న పోచమ్మ తల్లిని దర్శించుకున్నారు.



పోచమ్మతల్లి వద్దకు వెళ్తున్న గ్రామస్థులు

రాజన్న నిత్యాన్నదాన సత్రానికి విరాళం అందజేత



ఏఈవో శ్రావణ్‌ను కలిసి చెక్కులు అందజేసిన దాతలు

వేములవాడ కల్చరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి నిత్యాన్నదానానికి దాతలు విరాళాన్ని అందజేశారు. సుప్రీంకోర్టులో అడ్వకేట్‌గా చేస్తూ న్యూఢిల్లీలో నివాసం ఉంటున్న బోయినపల్లి మండలం వర్దవల్లి గ్రామానికి చెందిన పీచర శ్రీహర్ష, ఆయన స్నేహితుడు శ్రీకృష్ణకుమార్ కుటుంబసభ్యులతో కలిసి రాజన్నను దర్శించుకున్నారు. స్వామివారి దర్శనం అనంతరం రాజన్న నిత్యాన్నదాన సత్రానికి చెరో లక్ష రూపాయల చొప్పున ఏఈవో శ్రావణ్‌కుమార్‌కు అందజేశారు. వారివెంట కాంగ్రెస్ జిల్లా నాయకుడు చింతపల్లి శ్రీనివాస్‌రావు ఉన్నారు.

నిధుల గోల్‌మాల్‌పై చర్యలేవి?

● జగిత్యాల జిల్లా వైద్య విధాన పరిషత్‌లో రూ.7కోట్లు దుర్వినియోగం

● ఏడాది అవుతున్నా ఎటూ తేలని వ్యవహారం

● తాజాగా సూపరింటెండెంట్ ఫిర్యాదుతో పోలీసుల ఆరా



విచారణ జరుపుతున్న అధికారులు(ఫైల్)

జగిత్యాల అర్బన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా వైద్య విధాన పరిషత్‌లో గత ఏడాది జరిగిన రూ.7కోట్ల నిధుల గోల్‌మాల్ వ్యవహారంలో ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో సొమ్ము రికవరీ కాలేదు. ఈ వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించగా ఉన్నతాధికారులు వైద్యవిధానపరిషత్ రికార్డు అసిస్టెంట్ యాసిన్‌ను సస్పెండ్ చేసి రెండున్నర కోట్లు రికవరీ చేసినా మిగతాసొమ్ము సంగతి అధికారులు పట్టించుకోలేదు. తాజాగా గతమేనెలలో టీవీవీపీ (తెలంగాణ వైద్యవిధానపరిషత్) జగిత్యాల సూపరింటెండెంట్ ఎస్పీ అశోక్‌కుమార్‌కు ఫిర్యాదు చేయడంతో నిధుల గోల్‌మాల్ వ్యవహారం మళ్లీ ముందుకు వచ్చింది.

● అవినీతి బయట పడిందిలా..

కోరుట్ల టీవీవీపీ సూపరింటెండెంట్ గత సంవత్సరం ఒక చెల్లింపు విషయంలో వైద్య విధానపరిషత్‌కు చెందిన బ్యాంక్ ఓచర్‌పై 8వేల రూపాయలు రాసి ఇచ్చారు. రికార్డు అసిస్టెంట్ దానిని 28లక్షల రూపాయలుగా మార్చి ఇదే డిపార్ట్‌మెంట్‌కు చెందిన మరో వినియోగం లేని అకౌంట్‌లో వేయడంతో ఈ అక్రమాల వ్యవహారం బయటకు వచ్చింది. దీంతో ఈ విషయమై ఉన్నతాధికారులు విచారణ జరపడంతో వైద్యవిధాన పరిషత్‌కు చెందిన యాసిన్ అనేఉద్యోగి ఈ అకౌంట్‌ను వాడుతున్నట్లు గుర్తించారు. వెంటనే ముగ్గురు సభ్యులతో విచారణ కమిటీని నియ మించారు. అయితే ఈ విచారణలో ఉద్యోగుల ఖాతాలో జమ చేయా ల్సిన డీఏ, ఏరియర్స్, సీపీఎస్ ఏరియర్స్, మరియు రెగ్యులర్ ఏరి యర్స్‌తోపాటు వివిధ ఖాతాల్లో వేయాల్సిన ఏడుకోట్ల సొమ్ము పక్క దారి పట్టినట్లు విచారణ కమిటీ సభ్యులు గుర్తించారు. అయితే వినియోగంలో లేనిఖాతాకు సొమ్ము మళ్లించిన యాసిన్ తనదగ్గరి వ్యక్తుల ఫోన్ నంబర్‌ను ఖాతాకు లింక్ చేసి దానిపై యూపీఏ అకౌంట్‌క్రియేట్ చేసి డబ్బులు డ్రా చేసినట్లు అధికారులు గుర్తించారు.

● 2020 నుంచి ఆడిట్ చేస్తే మరిన్ని అక్రమాలు వెలుగులోకి..

జగిత్యాల జిల్లా వైద్యవిధాన పరిషత్‌లో రికార్డు అసిస్టెంట్ యాసిన్ 2020నుంచి లావాదేవీలు పర్యవేక్షిస్తుండగా ఆడిట్ అధికారులు 2022నుంచి ఆడిట్ చేశారు. మరో రెండు సంవత్సరాల ఆడి ట్ నిర్వహించి మరింత లోతుగా విచారణ జరిపితే మరింత అవినీతి బయట పడే అవకాశం ఉన్నదని భావిస్తున్నారు. నిధుల గోల్‌మాల్‌పై గతంలో విచారణ జరిపిన కమిటీ సభ్యులకు బ్యాంక్‌అధికారులు సహకరించక పోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నట్లు అధికారులు భావిస్తున్నారు. వినియోగంలో లేని ఖాతాను తిరిగి తెరిచేందుకు జిల్లా అధికారుల సంతకం ఫోర్జరీ చేశారా అనే కోణంలో విచారణ జరిపితే అన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

● ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు

- రామకృష్ణ, సూపరింటెండెంట్ టీవీవీపీ, జగిత్యాల

జగిత్యాల అర్బన్, జగిత్యాల జిల్లా తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లో గతసంవత్సరం జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టాల్సిందిగా జగిత్యాల పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. పోలీసుల విచారణ అనంతరం అక్రమాలకు పాల్పడిన వారిపై ప్రభుత్వ ఆదేశాలకు మేరకు చర్యలు చేపడతాం.

మాజీ ఎంపీటీసీ కుంటయ్య ఆరోపణల్లో నిజం లేదు..

● రూరల్ సీఐ మొగిలి



మాట్లడుతున్న రూరల్ సీఐ మొగిలయ్య

తంగళ్లపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మాజీఎంపీటీసీ కుంటయ్య చేసిన ఫిర్యాదును పట్టించుకోలేదని పోలీసులపై అసత్యప్రచారం, తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని రూరల్ సీఐ మొగిలి అన్నారు. బుధవారం సీఐ విలేకరుల సమావేశంలో మాట్లడుతూ తంగళ్లపల్లి మండలం అంకుసాపూర్ మాజీఎంపీటీసీ కర్కబోయిన కుంటయ్య 2023జూలై 25వ తేదిన లేని భూమిని తనకు మల్యాల నాగరాజు రిజిస్ట్రేషన్ చేశాడని ఫిర్యాదు చేశాడన్నారు. దీనిపై స్పందించి మల్యాల నాగరాజుపై చీటింగ్ కేసు నమోదు చేసి సాక్ష్యాధారాలు సేకరించి న్యాయస్థానంలో చార్జిషీట్ దాఖలు చేసినట్లు తెలిపారు. అలాగే తంగళ్లపల్లికి చెందిన గంగ కిష్టరెడ్డి 2024 డిసెంబర్ 12వతేదిన కర్కబోయిన కుంటయ్య భూమి విషయంలో మోసం చేశాడని పోలీసులకు ఫిర్యాదు చేశాడన్నారు. కుంటయ్యపై కేసు నమోదుచేసి దర్యాప్తు జరిపి న్యాయస్థానంలో చార్జిషీట్ దాఖలు చేసినట్లు తెలిపారు. ఈక్రమంలో పోలీసులపై తప్పుడు ఆరోపణలు, వదంతులు ప్రచారం చేస్తున్నారని అన్నారు. పోలీసులు న్యాయబద్ధంగా, నిష్పక్షపాతంగా స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకుంటారన్నారు. పోలీసులు భూమి సంబంధించిన అంశాలు, సివిల్ వివాదాల్లో ఎటువంటి జోక్యం చేసుకోలేదని, చట్టపరిధిలో విచారించారని తెలిపారు. భూమిఅంశాలు, సివిల్‌వివాదాలను న్యాయస్థానంలో పరిష్కరించుకోవాలని తెలిపారు.

రేపు జాబ్ మేళా

గణేశ్‌నగర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు కరీంనగర్‌లోని రిలయన్స్ నిప్పన్ లైఫ్ ఇన్సూరెన్స్ కరీంనగర్‌లో ఉద్యోగాలు కల్పించడానికి 21న శనివారం తనిష్క్ జ్యువెలర్స్ 4వ అంతస్తు, గెస్ట్ హౌస్ ఎదురుగా, సవరన్ వీధి కరీంనగర్‌లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి వై.తిరుపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. రిలయన్స్ నిప్పన్ లైఫ్ ఇన్సూరెన్స్ లో 2 లైఫ్ ప్లానింగ్ అధికారి, అప్రెంటీస్, ఎల్‌పిఓ 20 పోస్టులు ఖాళీలు ఉన్నాయని, వీటికి మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులని తెలిపారు. ఏదైనా డిగ్రీ ఆపై చదివి ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని, వారి వయస్సు 20 సంవత్సరాలు, నెలసరి వేతనం 20 వేలు ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు జూన్ 21న ఉదయం 11 గంటలకు సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో ఆర్‌అండ్ బి గెస్ట్‌హౌస్ ఎదురుగా, తనిష్క్ జ్యువెలర్స్ 4వ అంతస్తు, కరీంనగర్ కు వచ్చి పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెం. 9848168440, 6281363909 నందు సంప్రదించాలని తెలిపారు.

గుడుంబా పట్టివేత

వెల్గటూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలంలోని జగదేవపేట గ్రామా నికి చెందిన దారంగుల మల్లేష్ గుడుంబా అమ్ముతుండగా పట్టుకున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు. 20 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ ఎవరైనా గుడుంబా తయారు చేసినా, అమ్మినా కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

ద్విభాషా పుస్తకాలు

● తెలుగు, ఇంగ్లీషులో ప్రభుత్వ పాఠ్య పుస్తకాలు

● విద్యార్థులకు ఉపయోగకరం



కరీంనగర్ టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నాలుగేళ్ల క్రితం నుంచే ఇంగ్లీష్ మీడియం ప్రారంభించారు. అయితే ఇప్పటి వరకు తెలుగు మీడియంలో చదివిన విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియంలో చదవడం కష్టంగా మారింది. దీంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాఠాలను అర్థం చేసుకోలేక పోతున్నారని విద్యాశాఖ అధికారులు గుర్తించారు. దీన్ని అధిగమించడానికి పాఠ్యపుస్తకాల్లోని పాఠ్యాంశాలను ఒక పక్క ఇంగ్లీష్, మరో పక్క తెలుగులో ముద్రించి ఇవ్వాలని నిర్ణయించింది. గత ఏడాది 1 నుంచి 10వ తరగతి వరకు గణితం, ఫిజిక్స్, బయాలజీ, సాంఘిక శాస్త్రం పాఠ్యపుస్తకాలను ఇంగ్లీష్, తెలుగు భాషల్లో అచ్చు వేసి పంపిణీ చేసింది.

పేజీలు ఎక్కువ ఉండడంతో రెండు భాగాలుగా..

ఈ యేడాది కూడా గణితం, జీవశాస్త్రం, భౌతిక శాస్త్రం, సాంఘిక శాస్త్రం పాఠ్య పుస్తకాల్లోని మొత్తం చాప్టర్లను ఒక పేజీ ఇంగ్లీష్, దాని పక్కనే మరో పేజీలో తెలుగు బాషల్లో ముద్రించారు. పేజీలు పెరగడంతో వీటి పరిమాణం, బరువు ఎక్కువ అవుతుండడంతో విద్యార్థుల సౌలభ్యం కోసం రెండు భాగాలుగా విభజించారు. మొదటి బాగం జూన్ నుంచి అక్టోబరు వరకు ఎస్ఏ-1 పరీక్షల కోసం పార్ట్-1గా, రెండో భాగం నవంబరు నుంచి మార్చి వరకు ఎస్ఏ-2 పరీక్షల కోసం (పార్ట్-2)గా విభజించారు.

ఆకర్షణీయంగా..

పాటశాలలు పునఃప్రారంభమైన 12వ తేదీ నుంచే ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలను పంపిణీ చేస్తున్నారు. పుస్తకాల కవర్ పేజీ ముద్రణలు చాలా ఆకర్షణీయంగా ఉన్నాయి. ఈ పుస్తకాల్లో పాఠ్యాంశాలకు అనుగుణంగా రంగురంగుల బొమ్మలు చూడగానే పాఠం సారాంశం అర్థమయ్యేలా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. దీనికి తోడు పాఠ్యపుస్తకాల్లో ప్రతీ పాఠానికి ఒక క్యూ ఆర్ కోడ్ ఉంటుంది. దీనిని మొబైల్ ద్వారా స్కాన్ చేసి ఆపాఠానికి సంబంధించిన వీడియోలను వీక్షించవచ్చు. తెలుగు మీడియం నుంచి వచ్చిన విద్యార్థులు ఇంగ్లీష్ మీడియంలో సులువుగా చదివి రాణిస్తారని విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు.

విద్యార్థులు అవగాహన పెంచుకోవచ్చు

చకినాల రామ్మోహన్, ఎస్ఏ గణితం, తిమ్మాపూర్ మండలం



పాఠ్యపుస్తకాలను రెండు భాషల్లో ముద్రించడం విద్యార్థులకు ఉపయోగకరంగా ఉన్నాయి. ఇంగ్లీష్ మీడియంలో వెనకబడిన విద్యార్థులు తెలుగులో చదివి అవగాహన పెంచుకోవచ్చు.

విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

సుభాష్‌నగర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వనిబంధనలు పాటించని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ అంబేద్కర్ యువజనసంఘం జిల్లా అధ్యక్షుడు క్యాదాసి ప్రభాకర్ డిమాండ్‌చేశారు. గురువారం నగరంలోని సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. చాలావిద్యాసంస్థల్లో విద్యార్థులకు ఆటస్థలం లేదని, పార్కింగ్ లేదని అన్నారు. విద్యాహక్కుచట్టాన్ని ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అధికఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. ప్రైవేటు విద్యా సంస్థల్లో 25శాతం సీట్లు ఎస్సీ ఎస్టీవర్గాల పిల్లలకు ఉచితంగా కేటాయించాలని, స్టేషనరీ కూడాఉచితంగా అందచేయాలని చట్టం చెబుతుందన్నారు. ఈ చట్టాన్ని అమలు చేయని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీబీఎస్ఈ చట్టం ప్రకారం ప్రతిపాఠశాలలో పేరెంట్స్, టీచర్స్ అసోసియేషన్‌లో ఇద్దరు తల్లిదండ్రులకు భాగస్వామ్యం కల్పించాలన్నారు. అసోసియేషన్ సూచనమేరకే ఫీజులు పెంచాలని తెలిపారు. నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై సంబంధిత అధికారులు తగినచర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో కలెక్టరేట్ ఎదుట నిరాహార దీక్షచేపడతామని హెచ్చరించారు. సమావేశంలో రాష్ట్రకార్యదర్శి మీసాలసాయిలు, జిల్లాప్రధానకార్యదర్శులు మైసనిమనోహర్, మానాలనారాయణ, చామనపల్లిచంద్రశేఖర్,ఉపాధ్యక్షులు గండిగణేష్, తాటిపల్లి జంపన్న తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలను పరిశుభ్రంగా ఉంచాలి

● జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ



కొత్తపల్లి ఆరోగ్య కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ

భగత్‌నగర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ అన్నారు. కొత్తపల్లి ప్రాథమికఆరోగ్య కేంద్రాన్ని ఆయన గురువారం పరిశీలించారు. అవుట్ పేషంట్ రిజిస్టర్‌లు, ఇతర రికార్డులను పరిశీలించారు. ఎన్‌సీడీ క్లినిక్‌లో అసంక్రమిత వ్యాధుల రిజిస్టరైన రెడ్ పుస్తకం, బ్లూ పుస్తకాలను పరిశీలించారు. అందులో రక్తపోటు, షుగర్ వ్యాధిగ్రస్తుల వివరాల నమోదును పరిశీలించి వారికి మందులు ఇస్తున్న తీరును పరిశీలించారు. ఫార్మసి స్టోర్‌లో సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందుల నిల్వలను పరిశీలించారు. ఆపరేషన్ థియేటర్‌ను, ప్రసూతి గది పరిశుభ్రతలను పరిశీలించి అందులో ఉండాల్సిన అత్యవసర మందులను పరిశీలించారు. మొదటి కాన్పులను సిజేరియన్ చేయించు కోవడంవల్ల కలిగే సమస్యలను వివరించి సాధారణ ప్రసవాలు ఆరోగ్యకేంద్రాల్లో జరిగేట్లు గర్భవతులను వారి కుటుంబసభ్యులను ప్రోత్సహించాలన్నారు.

● ఫీల్డ్ ట్రైనింగ్..

బీఏఎంఎస్ డాక్టర్లకు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగే ఆరోగ్యకార్యకలాపాలపై ఫీల్డ్ ట్రైనింగ్‌లో భాగంగా అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పీవోఎంహెచ్ఎన్ డాక్టర్ సన జవేరియా, కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి నజియా, డీపీవో ఎన్‌హెచ్ఎం స్వామి, సాగర్, బీఏఎంఎస్ డాక్టర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

● న్యూస్‌బాక్స్

ఫకీర్‌పేటలో డీపీవో పర్యటన

కరీంనగర్ రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం ఫకీర్‌పేట గ్రామంలోని నర్సరీని జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్ పరిశీలించారు. గురువారం గ్రామంలో రికార్డ్ వెరిఫికేషన్ చేయడమే కాకుండా నర్సరీలను, సెగ్రిగేషన్ షెడ్, సానిటేషన్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి దేవిక ఉన్నారు.

సీపీని కలిసిన అదనపు కలెక్టర్



పోలీస్ కమిషనర్‌కు పూలమొక్క అందిస్తున్న అడిషనల్ కలెక్టర్

కరీంనగర్ క్రైం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఇటవల కరీంనగర్ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ అశ్విని తానాజీ వాకడే గురువారం పోలీస్‌కమిషనర్ గౌస్ ఆలంను మర్యాదపూర్వకంగా కలిశారు. కమిషనరేట్ కేంద్రంలో పోలీస్ కమిషనర్‌ను కలిసిన అదనపు కలెక్టర్ ఆయనకు పూలమొక్కను అందజేశారు.

బెస్ట్ అవైలబుల్ స్కూల్‌కు ఎంపికైన నరేంద్ర విద్యాలయం

గంగాధర, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీదేవిపల్లిలోని నరేంద్ర విద్యాలయం బెస్ట్ అవైలబుల్ స్కూల్‌కు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ రాజేశం తెలిపారు. గంగాధరలో మాట్లాడుతూ నాన్ రెసిడెన్సియల్ బెస్ట్ అవైలేబుల్ పాఠశాలగా ఎంపికైందని, మండల ప్రజలు 1వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

జమ్మికుంట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో నైట్‌వాచ్ ఉమెన్‌గా పనిచేయుటకు అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాధికారిణి హేమలత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణులై, వయస్సు 40 సంవత్సరాలు, మండల వాస్తవ్యురాలై ఉండాలని, ఎక్కడైనా సెక్యూరిటీ ట్రైనింగ్ తీసుకుని ఉంటే ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ఆసక్తిగల వారు ఈ నెల 21 నుంచి మండల వనరుల కేంద్రంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

కరీంనగర్ అర్బన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): దేశ సమైక్యత, సమగ్రత, రాజ్యాంగ పరిరక్షణ కోసం తపించే వ్యక్తి రాహుల్ గాంధీ అని డీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత, జాతీయ కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ పుట్టినరోజు సందర్భంగా కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మానకొండూరు ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రహ్మత్ హుస్సేన్‌లతో పాటు పలువురు నేతలు హాజరయ్యారు. అనంతరం నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇందిరా చౌక్ వద్ద కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రహమత్ హుస్సేన్, నాయకులు ఎండీ తాజ్, కర్ర సత్యప్రసన్నరెడ్డి, మడుపు మోహన్, శ్రావణ్ నాయక్, గడ్డం విలాస్‌రెడ్డి, ఆకారపు భాస్కర్‌రెడ్డి, చర్ల పద్మ, బొబ్బిలి విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

● హుజూరాబాద్: అంబేడ్కర్ చౌరస్తా వద్ద రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ కేక్ కట్ చేశారు.



తెలంగాణ చౌక్ వద్ద రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు



హుజూరాబాద్‌లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

● జమ్మికుంట: పట్టణంలోని గాంధీచౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేష్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇల్లందకుంట దేవస్థానం మాజీ చైర్మన్ దేశిని కోటి హాజరై కేకు కట్ చేసి పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు బుడిగె శ్రీకాంత్ ఆధ్వర్యంలో వేడుకలు జరిపారు.

● గంగాధర: గంగాధరలో జన్మదిన వేడుకలను కాంగ్రెస్‌పార్టీ మండలాధ్యక్షుడు మనోహర్, జాగిరపు శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో ఉపాధ్యక్షుడు వేముల భాస్కర్ తదితరులు ఘనంగా నిర్వహించారు.

● మానకొండూర్: మానకొండూర్‌లో పల్లెమీద బస్టాండ్ వద్ద కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు ఎన్ రవీంద్రాచారి, డీసీసీ ప్రధానకార్యదర్శి సంపత్‌గౌడ్, ఎం ఓదెలు ఉన్నారు.

● రామడుగు: మండలకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జవ్వాజిహరీష్ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం రైతుభరోసా విడుదల చేసిన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

● వీణవంక: మండలకేంద్రంతోపాటు చల్లూరులో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్స్ పంపి ణీ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్ రెడ్డి, గంగాడి తిరుపతి రెడ్డి, తదితరులున్నారు.

● గన్నేరువరం: మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడు కలను ఘనంగా నిర్వహించారు.

● చొప్పదండి: చొప్పదండిలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు.

ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం

(5వ పేజీ తరువాయి)

తెలుస్తున్నది. వ్యవసాయంతో ఎరువులు, క్రిమిసంహారక మందుల వినియో గం పెరిగింది. వీటిని ఉపయోగించి పండించిన ఆహార ధాన్యాలు, కూరగాయలు తినడంతో రోగాల బారిన పడుతున్న ప్రజలు ప్రకృతి సిద్ధంగా పండించిన పంటలపై ఆసక్తి చూపిస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేకంగా ప్రకృతి సేద్యం ద్వారా పండించిన ఆహార పదార్థాలు, కూరగాయల షాపులు వెలుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని నిర్ణయించి ఈ పథకం అమలు చేస్తోంది.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు : ప్రణవ్

హుజూరాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతాయని హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. గురువారం పట్టణంలోని 15,17వ వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లు రాని అర్హులైన వారు ఆందోళన పడాల్సిన అవసరం లేదన్నారు. తప్పకుండా ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతాయన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రాన్ని సందర్శించిన అధికారులు

తిమ్మాపూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల భవితకేంద్రాన్ని జిల్లా సెక్టోరియల్ అధికారులు అంజనేయులు, శ్రీనివాస్ సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. కొత్తగా గుర్తించిన దివ్యంగా పిల్లల పేర్లను పాఠశాల రిజిస్టర్‌లో నమోదు చేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీనివాస్, ఉపాధ్యాయులు జ్యోతి, ఐఈఆర్‌పిలు గణేష్, పద్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు యువత జిల్లా అధ్యక్షుడిగా మహేష్

కరీంనగర్ అర్బన్/గన్నేరువరం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా మున్నూరుకాపు యువత జిల్లాల అధ్యక్షులను గురువారం ప్రకటించారు. కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా గన్నేరువరం మండలం ఖాసీంపేట గ్రామానికి చెందిన గంప మహేష్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు సంజీవ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా గంప మహేష్ మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన తన గురువు, కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర అధికారప్రతినిధి డాక్టర్ కొనగాల మహేష్‌కు రుణపడి ఉంటానని, రాష్ట్ర అధ్యక్షులు సంజీవ్‌కు ధన్యవాదాలు తెలిపారు. వారిద్దరి మార్గనిర్దేశత్వంలో కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా మున్నూరుకాపు యువత, మున్నూరుకాపుల బలోపేతంకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. గంప మహేష్ నియామకంపట్ల కరీంనగర్ జిల్లా, గన్నేరువరం మండలం మున్నూరుకాపు నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

వానాకాలం సాగుకు సిద్ధం అవుతున్న రైతులు



ట్రాక్టర్‌తో పొలం దున్నుతున్న రైతు

మానకొండూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ మండలంలో రైతులు వానాకాలం సాగుకు సిద్ధం అవుతున్నారు. మండలంలో సుమారు 30వేల ఎకరాల భూమి సాగుకు సిద్ధంగా ఉంది. చెరువులు, కుంటలు ఎండిపోగా వ్యవసాయబావులు ఉన్న రైతులు తమ పొలాలను దున్నుతున్నారు. నెల రోజుల క్రితం పోసిన వరినారు నాటుకు సిద్ధంగా ఉంది. ఆరుద్ర కార్తెలోనైనా వర్షాలు పడాలని రైతులు ఆశగా చూస్తున్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి



మాట్లాడుతున్న రామరపు వెంకటేష్

జమ్మికుంట రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామరపు వెంకటేష్ అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన సందర్శించారు. విద్యార్థుల వద్దకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, లేకుంటే మంత్రులను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోరె జగదీష్, శ్రీకాంత్, రమేష్, బన్ని, మని, భారత్, గణేష్, సందీప్ పాల్గొన్నారు.

యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో రేపు యోగా డే

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా యోగా అసోసియేషన్, జిల్లా యువజన క్రీడాశాఖల సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం యోగాడేతో పాటు జాతీయస్థాయిలో పాల్గొన్న యోగా క్రీడాకారులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సర్దార్ రవీందర్‌సింగ్, నాగిరెడ్డి సిద్ధారెడ్డిలు తెలిపారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో ఉదయం 6:30 గంటల నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, జిల్లా యువజన క్రీడాశాఖాధికారి వి శ్రీనివాస్‌గౌడ్ హాజరుకానుండగా జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్ధన్‌రెడ్డిలతో పాటు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బి వేణుగోపాల్ పాల్గొనున్నారు.

అలంకారప్రాయంగా క్రీడా ప్రాంగణాలు

● మూలనపడ్డ క్రీడాకిట్లు

మానకొండూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణాలు అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి. మండలంలో 27గ్రామపంచాయతీలు ఉండగా నిజాయితీగూడెంలో స్థలం లేక క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయలేదు. మిగతా 26గ్రామాల్లో ఒక్కొక్క దానికి రూ.2లక్షల ఎస్టిమేషన్ ఉన్నప్పటికీ లక్ష రూపాయల వరకే చెల్లించారు. ఈ క్రీడా ప్రాంగణాల్లో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బారు, ఆర్చీల నిర్మాణం ఎంతో ఆర్భాటంగా పూర్తి చేశారు. రంగపేట క్రీడాప్రాంగణం సుమారు 4కిలోమీటర్ల దూరంలో యువకులకు ఉపయోగపడకుండా ఉంది. శ్రీనివాస్‌నగర్ క్రీడాప్రాంగణం ఆటలకు అనుకూలంగా లేదు. ప్రతి గ్రామానికి 16రకాల ఆట వస్తువుల క్రీడా కిట్టు అందించారు. ఆ కిట్లు మూలన పడడంతో యువత క్రీడాప్రాంగణాలకు దూరం అయ్యారు.



గుట్ట వద్ద ఏర్పాటు చేసిన శ్రీనివాస్‌నగర్ క్రీడాప్రాంగణం

సుడా నిధులతో దుర్శేడ్‌లో అభివృద్ధి పనులు



భూమి పూజ చేస్తున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలు పరిష్కరించడానికే కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. గురువారం దుర్శేడ్‌లో 20లక్షల సుడా నిధులతో డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండింటిని సమదృష్టితో చూస్తూ ముందుకు వెళ్తున్నామని అన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాం గ్రెస్ అధ్యక్షుడు సాయిని తిరుపతి, గ్రామ శాఖ అధ్యక్షుడు బుర్ర హరీష్ గౌడ్, మాజీ సర్పంచ్ గాజుల అంజయ్య, మాజీ ఉప సర్పంచ్ సుంకిశాల సంపత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్,జూన్19(ఆంధ్రజ్యోతి): నగరంలోని రూరల్ ప్రాంతాలలో విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా గురువారం ఉదయం 9గంటల నుంచి 11 గంటల వరకు వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్, టూ, రూరల్, ఏడీఈలు ఎం లావణ్య, గాధం రఘు తెలిపారు. పద్మనగర్ ఏరియా, ఇండస్ట్రియల్ ఏరియా, సాయిబాబా టెంపుల్ ఏరియా, లారెల్ స్కూల్ ఏరియాలో, రూరల్ ప్రాంతంలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రేకుర్తి, రేకుర్తి పాతవాడ, కొత్తవాడ, సాలెహ్‌నగర్, విజయపురికాలనీలో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు చెర్లబూత్కూర్, తిరుమల ఇండస్ట్రీస్, ఆయిల్ మిల్, ముగ్ధంపూర్, డెక్కన్‌క్రానికల్ ప్రాంతాలలో సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

'భూ వివాదంలో నా సోదరుడికి ఎలాంటి సంబంధం లేదు'

సుభాష్‌నగర్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రేకుర్తి భూ వివాదంలో తన సోదరుడు నందెల్లి మహిపాల్‌కు ఎలాంటి సంబంధం లేదని మాజీ సర్పంచ్ నందెల్లి ప్రకాశ్ తెలిపారు. గురువారం నగరంలోని బీఆర్ఎస్ నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేకుర్తిలోని ఓ స్థల వివాదంలో తన సోదరుడు మహిపాల్‌పై అబుబాకర్ ఖాలిద్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడని తెలిపారు. అతను కాంగ్రెస్ పార్టీకి చెందిన వ్యక్తి అని, అగ్రనాయకుల ప్రోద్బలంతో కేసులు పెట్టించాడని ఆరోపించారు.

కొక్కెరకుంటలో బీజేపీ సమావేశం

రామడుగు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొక్కెరకుంట గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కార్యదర్శి ఉప్పు రాంకిషన్ హాజరై మాట్లాడారు. మండలశాఖ అధ్యక్షులు మోడీ రవీందర్, మండల ఉపాధ్యక్షుడు వేముండ్ల కుమార్, మండల కార్యదర్శి గుంట అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైని సన్మానించిన నాయకులు

వీణవంక, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు నూతనంగా వచ్చిన ఎస్సై ఆవుల తిరుపతిని గురువారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్‌రెడ్డి పలువురు నాయకులు ఉన్నారు.

పులి ఆంజనేయులు గౌడ్‌ను పరామర్శించిన మంత్రి పొన్నం

రామడుగు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిప్పకుర్తి గ్రామానికి చెందిన కాంగ్రెస్‌పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పులి ఆంజనేయులుగౌడ్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం పరామర్శించారు. అంజనేయులుగౌడ్ తండ్రి పరశురాంగౌడ్ ఇటీవల మృతి చెందగా మంత్రి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. మంత్రివెంట చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆకారపు భాస్కర్‌రెడ్డి, బొమ్మ శ్రీరాం చక్రవర్తి తదితరులు ఉన్నారు.

గద్దర్ అవార్డు గ్రహీత రవిచంద్రకు ఘన సన్మానం



రవిచంద్రను సన్మానిస్తున్న కఫిసా బాధ్యులు

కరీంనగర్ కల్చరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల ప్రభుత్వంచే ఫిలిం క్రిటిక్ గద్దర్ అవార్డు పొందడంతో పాటు జన్మదినం సందర్భంగా పొన్నం రవిచంద్రను గురువారం ఓ గార్డెన్‌లో పలువురు నాయకులు, మిత్రులు, కవులు, రచయితలు ఘనంగా సన్మానించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇదే వేదిక మీదుగా తాను గతంలో ప్రకటించినట్లు జన్మదినం పురస్కరించుకొని రవిచంద్ర ఒక లక్ష రూపాయలు అయ్యప్ప ఆలయ మండప నిర్మాణానికి చెక్ రూపంలో ఆలయ చైర్మన్ వై అనిల్‌కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా రవిచంద్ర మాట్లాడుతూ తనను ప్రోత్సహిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. గద్దర్ అవార్డును కరీంనగర్ ప్రజలకు అంకితమిస్తున్నాని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆకారపు భాస్కర్‌రెడ్డి, మల్లికార్జున రాజేందర్, వైద్యుల అంజన్‌కుమార్, చాడగొండ బుచ్చిరెడ్డి, కటకం వేంకటర మణ, గుగ్గిళ్ల శ్రీనివాస్, చక్రధర్‌రావు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌ను కలిసిన జిల్లా అధికారులు

కరీంనగర్‌టౌన్/సుభాష్‌నగర్,జూన్ 19 (ఆంధ్రజ్యోతి): అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడేను జిల్లా అధికారులు, తహసీల్దార్లు, రెవెన్యూ, కలెక్టరేట్ సిబ్బంది గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పూల మొక్కలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో శ్రీనివాస్, డీఆర్‌డీవో శ్రీధర్, డీడబ్ల్యుఓ సరస్వతి, డీవైఎస్‌వో శ్రీనివాస్, బీసీ సంక్షేమ అధికారి అనిల్ ప్రకాశ్, మైనార్టీ సంక్షేమ అధధికారి పవన్ కుమార్, జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్, వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది,ఇ మెప్మా పీడీ వేణు మాధవ్, ఎస్‌వైకే కో-ఆర్డినేటర్ రాంబాబు, హౌజింగ్ పీడీ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

● సుభాష్‌నగర్ : జిల్లా అదనపు కలెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన అశ్విని తానాజీ వాకడేను గురువారం తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం(టీజీవో) జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి కాళీచరణ్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పూల మొక్కను అందచేసి శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధానకార్యదర్శి డాక్టర్ అరవింద్ రెడ్డి, కోశాధికారి నాగరాజు, సుధాకర్ పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్‌కు అభినందనలు తెలుపుతున్న అధికారులు

రేపటి యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

కరీంనగర్ కల్చరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : వికాసతరంగిణి, ప్రజ్ఞ వికాస్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు మహాత్మా జ్యోతిబాపూలే సర్కస్ గ్రౌండ్‌లో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని వికాసతరంగిణి, ప్రజ్ఞా వికాస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు పిలుపునిచ్చారు. గురువారం ఆండాళ్ గోష్టి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో జోనల్ అధ్యక్షుడు కె గౌతమరావు, కార్యదర్శి కోశాధికారులు యాద కిషన్, సిరికొండ వేంకటేశం, రవీందర్‌రావు, ప్రభాకర్‌రావు, కరుణాకర్‌రావు పాల్గొన్నారు.

యోగాసానాలపై విద్యార్థినిలకు అవగాహన

జమ్మికుంట: జమ్మికుంట పట్టణంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల, జూనియర్ కళాశాల బాలికలకు ఆయూష్ మెడికల్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగాసానాలపై గురువారం అవగాహన కల్పించారు. అనంతరం వైద్య శిబిరం ఏర్పాటు చేసి పరీక్షలు జరిపి మందులు పంపిణీ చేశారు. ఆయూష్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి రవీందర్‌రావు, డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ డి సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

యోగాను ప్రపంచానికి పరిచయం చేసిన మోదీ

భగత్‌నగర్: యోగాను ప్రపంచానికి పరిచయం చేసిన ఘనత దేశ ప్రధాని మోదీకే దక్కుతుందని బీజేపీ పశ్చిమ జోన్ కన్వీనర్ జాడి బాల్‌రెడ్డి అన్నారు. గురువారం ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో ముందస్తుగా యోగా డేను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు బొంగోని పరుశురామ్‌గౌడ్, ప్రోగ్రాం కన్వీనర్ నరహరి లక్ష్మారెడ్డి, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు హనుమాండ్ల రఘుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం

శంకరపట్నం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడికల్ గ్రామానికి చెందిన వొడ్నాల సత్తమ్మ గురువారం అనారోగ్యంతో మృతి చెందగా, కుటుంబసభ్యులు ఆమె నేత్రాలను దానం చేశారు. నేత్రాలు మరో ఇద్దరు అంధులకు చూపును ప్రసాదిస్తాయని సదాశయ ఫౌండేషన్ పెద్దపల్లి జిల్లా మహిళా అధ్యక్షురాలు వెల్ది కవిత సత్తమ్మ కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. దీంతో వారు నేత్రదానానికి అంగీకరించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు కుటుంబ సభ్యులను అభినందించారు.

అర్హులందరూ ఆయుష్మాన్ భారత్ కార్డులను తీసుకోవాలి

తిమ్మాపూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డులను అర్హులందరూ తీసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు సుగుర్తి జగదీశ్వరాచారి తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సిబ్బంది ఆధ్వర్యంలో ఆయుష్మాన్ భారత్ ఆరోగ్యకార్డుల నమోదు ప్రక్రియ కొనసాగుతుందని, వీటిని అర్హులైన ప్రజలందరూ సద్వియోగం చేసుకోవాలని కోరారు.

డయేరియాపై అవగాహన

శంకరపట్నం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మండల వైద్యాధికారి డాక్టర్ గొట్టె శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది డయేరియాపై గురవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 0-5 సంవత్సరాల పిల్లల్లో డయేరియా వ్యాధి లక్షణాలు.. తీసుకోవాల్సిన ఔషధాలు, జాగ్రత్తలపై వివరించారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన మాజీ మేయర్



మున్సిపల్ కమిషనర్‌ను సన్మానిస్తున్న మాజీ మేయర్ రవీందర్‌సింగ్

కరీంనగర్ టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నగరపాలక సంస్థ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రఫుల్ దేశాయ్‌ని మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమొక్క అందించి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గుంజపడుగు హరిప్రసాద్ పాల్గొన్నారు.

గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు



కేశవపట్నంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ సురేఖ



మద్దికుంటలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ విజయ్‌కుమార్

మానకొండూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మద్దికుంట, వన్నారం గ్రామాల్లో గురువారం భూభారతి రెవెన్యూ సదస్సులు జరిగాయి. భూ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న రైతుల నుంచి అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. రెండు గ్రామాల్లో మొత్తం 126 దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ విజయ్‌కుమార్, నాయబ్ తహశీల్దార్ సమ్మయ్య, ఆర్ఐ ఇతర అధికారులు ఉన్నారు.

● శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంలో 122 మంది రైతులు భూ సమస్యల పరిష్కారానికి దరఖాస్తులు చేసుకున్నట్లు తహసీల్దార్ సురేఖ తెలిపారు.

● చొప్పదండి: మండలంలో భూ భారతి రెవెన్యూ సదస్సులు ముగిశాయి. ఈ నెల 3న మండలంలోని భూపాలపట్నంలో సదస్సులు ప్రారంభం కాగా చొప్పదండితో ముగిశాయి. ప్రతి గ్రామంలో వందకుపైగా దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ నవీన్‌కుమార్ తెలిపారు.

డాక్టర్ రవీందర్‌రావుకు కన్నీటి వీడ్కోలు



అంత్యక్రియల్లో పాల్గొన్న ప్రముఖులు

బోయినపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సీనియర్ జనరల్ సర్జన్, ప్రతిమ మెడికల్ కాలేజ్ డీఎంఈ డాక్టర్ రవీందర్‌రావు(75) అనారోగ్యంతో బుధవారం మృతి చెందగా, ఆయన పార్థివదేహాన్ని స్వగ్రామమైన బోయినపల్లి మండలం కోరెం గ్రామానికి గురువారం తీసుకువచ్చారు. రవీందర్‌రావు భౌతికకాయాన్ని చివరిసారిగా చూసేందుకు గ్రామస్థులు తరలివచ్చి కన్నీటి వీడ్కోలు పలికారు. డాక్టర్ రవీందర్‌రావు బంధువులు మహారాష్ట్ర మాజీ గవర్నర్, మాజీ కేంద్ర మంత్రి చెన్నమనేని విద్యాసాగర్‌రావు, వినోద దంపతులు, కూతురు అల్లుడు మాజీ ఎంపీ బోయినిపల్లి వినోద్ కుమార్-మాధవి దంపతులతో పాటు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీజేపీ నాయకులు చెన్నమనేని వికాస్‌రావు, సునీల్‌రావు, ప్రతాప రామకృష్ణ ఘనంగా నివాళులు అర్పించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. పేదలకు అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు.

డాక్టర్ భూంరెడ్డికి మాజీ ఎంపీ వినోద్‌కుమార్ నివాళి

భగత్‌నగర్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ గురువారం డాక్టర్ భూంరెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో జరిగిన దశదిన ఖర్మలో పాల్గొని నివాళులు అర్పించి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు కార్యక్రమంలో చల్మెడ లక్ష్మీనర్సింహారావు, జక్కులనాగరాజు, వంశీచందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సంపత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.